


## గాంధీగారి రాజ్యంలో గాంధారి కొడుకులు

# మగాడి జన్మహక్కు

సి.వి. రమణారా

రైలు పట్టాలమీద పరిగెడుతోంది—రోడ్డుమీద పరిగెత్తే వీలులేదు కనక నూతన దేశభక్తుడి రాజకీయ జీవితంలా లాభసాటిగా పరిగెడుతోంది రైలు కంట్రాక్టరు గారిచ్చే విందు పార్టీల్లో గాజుల చేతుల్లా కలకల్లాడుతూ పరిగెడుతోంది రైలు

అలా చాలా రకాల నీచోపమానాల్లా మహాస్పీడుగా పరిగెడుతోంది రైలు ఆంధ్ర దేశంలో పరిగెడుతున్న రైలు కాబట్టి ఫస్ట్‌క్లాస్ కూడా ఆఖరి క్లాసులా ఫేమిలీ ప్లానింగ్ వాళ్ళ మాటని పెడచెవిన పెట్టేసినట్టుంది కిక్కిరిసి నే కూర్చున్న బెర్త్ మహా యిరుగ్గా వుంది యిద్దరం సన్నటి మనుషులమైనా, మూడో శాల్తీ ఓ స్త్రీ మూర్తి—కింగ్ కాంగ్‌కి ఆడ మేకప్ వేసినట్టుంది- దారాసింగ్ క్లాస్‌మేట్‌లా వుంది

చంబల్ వేలీలో మాన్‌సింగ్ మురాకు సలహా లిచ్చేదాన్లా—తెలివిగా వుంది ఆమె మొహం యిండియన్ విస్కీ ఫోర్సనుకుంటా—నీరుకమ్మి—నీరుల్లి రేకల్లా వున్నాయి ఆమె కళ్లు

మొద్దుగా—నిర్లక్ష్యంగా—అసహ్యంగా వున్నాయి ఆమె పెదవులు

చాలా వేలు పైచిలుకు ఖరీదు చేసే రవ్వల దుద్దులతో బరువుగా సాగుతున్నాయి ఆమె చెవులు అంట్లు తోమడం వృత్తిగా—పిడకలు చరచడం హాబీగా వున్నట్లున్నాయ్ ఆమె చేతి వేళ్లు

అందమైన చీర ఆమెను ఆయాసంగా చుట్టుకుని—ఆవకాయ కుండని ఫారెన్ ఎక్స్‌పోర్ట్‌కు పార్సెల్ చేసినట్టుంది

మూడున్నర మీటర్ల జాకెట్ గుడ్డ చాలక కాబోలు టైలర్ ఆమె జాకెట్ మెడని విశాలంగానూ, చేతులు చంకల్లోకీ కుట్టేశాడు

కుడిచేతికి పావు కిలో బంగారంతో చేయబడ్డ గాజులు ఎడం చేతికి కిలో రాయి సైజు రిస్ట్ వాచీ

కుడి చేతి మధ్యవేలికి బుద్ధుడు రావిచెట్టు కింద కూచున్న ఫోజులో ఉంగరం

మెళ్లో శంఖల తావళం అదీ బంగారంతో చుట్టినదే వుంది

ఆమె ఎదురు సీటులో కూచున్న ఓ ఖద్దరు మీసాల రాజుగార్ని వోరకంట చూసింది, ఆయన పది నిమిషాలనించి తననే చూస్తున్న కారణాన .

ఆ చూపుల తాలూకు వోల్టేజికి తట్టుకోలేక ఆయన కిటికీ వేపు మొహం తిప్పేసి చంటి పిల్లాడిలా, పరిగెడుతున్న రైలు కిటికీలోంచి టెలిగ్రాఫ్ స్థంభాలు లెక్కెట్టడం మొదలెట్టాడు

తర్వాత ఆమె నన్ను చూసింది, ఖద్దరు మీసాల రాజావారిని చూసినట్టే

శూర్పణఖ, హిడింబి, తాటకి వగైరా సుందరీమణులు గుర్తుకొచ్చారు నాకు.

కళ్లు మూసుకుని ఓ సారి జ్యోతిలక్ష్మిని తల్చుకుని మరీ చూశాను ఆమె వైపు- ఏ మాత్రం—ఏ విధమైన అభిప్రాయం కలగలేదు నాకు

జై హెలెన్, జై హలం, జై వగైరా సెక్స్ క్వీనుల్ని గుర్తుకు తెచ్చుకుని మరోసారి చూశాను.

సోఫియా లోరెన్, లిజ్ టేలర్ల మీద నేను గత మూడేళ్లుగా పెంచుకున్న ' అలాంటి అభిప్రాయం' కాస్తా హరీమంది

నా అవస్థ చూసి ఆమె నవ్వింది

అర కిలో లంక పుగాకు చుట్టలు అరగంటలో భస్మంచేసే కెపాసిటీ ఆమె పళ్ల మీద కనిపించింది

ఓడిపోయి, తలొంచేసుకుని మూర్ఛపోదామని ప్రయత్నించాను

'ఆ లైఫ్ ఓ సారి యిస్తారా' అనడిగింది ఆమె

కెనెడియన్ యింజన్ కూతే కొంచెం మధురంగా వుంటుంది

వైజాగ్‌లో కొన్న లైఫ్‌ని యిచ్చేసేను నిజంగా నా లైఫ్‌ని యిస్తున్నంత భయంగానూ "థాంక్స్" అంది ఆమె




నా మొహం మీద వర్షం జల్లు కొట్టినట్టయింది జేబు రుమాల్తో మొహం తుడుచుకున్నాను "నో మెన్షన్" అని సాధ్యమైనంత గ్రేస్‌గా అన్నాను లోపలి నీచ భావాలను సముదాయిస్తూ

"ఎక్కడికి వెడుతున్నారు" అంది కలుపుగోలుగా నాతో స్నేహం చెయ్యడానికి తాపత్రయ పడుతున్నట్టుందామె

కేవలం నా పురుష సౌందర్యంతో కాలేజీలో చాలామంది అమ్మాయిల్ని పల్టీ కొట్టించిన నాకు, జీవితంలో మొట్టమొదటిసారిగా నా మొహం మీద అసహ్యం వేసుకొచ్చింది

రైలు ఆగ్గానే దిగేసి చక్రాలకి పూసిన గ్రీజు మొహం నిండా నల్లగా మొత్తుకు వచ్చేద్దామనిపించింది. రైలాగింది

గ్రీజు విషయం మర్చిపోయి, సిగరెట్లకోసం దిగబోయా

"కాసిని వేడినీళ్లు తెచ్చిస్తారా" అంటూ బాస్కెట్‌లో వున్న ఫ్లాస్క్ తీసిచ్చింది. కావాలనే తన వేళ్లతో నా వేళ్లు నొక్కింది ఫ్రాక్చర్ కాలేదు ఒక్క వేలు కూడా

ఆ కంపార్ట్‌మెంట్‌లోంచి తొందరగా బయటపడి పారిపోవాలనే తాపత్రయంతో స్పీడుగా దిగబోయి, కాలు జారి ప్లాట్‌ఫారం మీద కొంత దూరం చాలా వేగంగా ప్రయాణించి ఓ చోట ఆగాను. తత్ఫలితంగా మోకాలిమీద రెండంగుళాల చర్మం టెర్లిన్ ఫేంటుతో సహా చెక్కుకుపోయింది




ఆమె గబగబా కంపార్ట్‌మెంట్ దిగి "అయ్యో, అయ్యో" అనుకుంటూ నన్ను ఆర్నెల్ల చంటి వెధవలా లేవదీసి, కంపార్ట్‌మెంటులో చేరవేసి, బాస్కెట్‌లోంచి యార్డ్లీ పౌడర్ తీసి, మోకాలిమీద మొత్తేసింది. ఖరీదైన జేబురుమాల్తో సినిమాటిక్‌గా కట్టుకట్టింది

"అయ్యో నే చచ్చిపోయాను కాదు, నే వేణ్ణీళ్లు అడిగిన మూలాన్నే మీకీ దెబ్బ తగిలింద"ని నుదురు తుడిచి, జుట్టు సవరించి, మంచిగంధంరేకుల మడత విసినికర్ర తీసి విసరడం మొదలెట్టింది

ఖద్దరు మీసాల రాజుగారూ తదితరులూ ఈ ఫార్సే చూస్తున్నారు

నాకు చాలా అసహ్యంగా వుంది పెట్టి పుచ్చుకు దిగేద్దామా అనిపించింది,

మరో ఫ్లాస్క్‌లోంచి హార్లిక్స్ కప్‌లోకి వంచి తాగమని బలవంతం పెట్టింది.

అక్కడ వున్నవాళ్లు నన్నే చూస్తున్నారు

అందరి కళ్లలోనూ ఒకటే భావం, ఒకటే భాష 'భలే ఛాన్స్ కొట్టేశావులే'

నాకు చచ్చే సిగ్గుగా వుంది

ఆవిడ మరోసారి హార్లిక్స్ తాగమని హెచ్చరించింది

"వద్దండీ, ప్లీజ్" అన్నా చూస్తున్న ప్రేక్షకుల కోసం.

బలవంతంగా ఆవిడ హార్లిక్స్ కప్ నోటి కందించింది

తాగక తప్పలేదు

తాగకపోతే- కాళ్ల మీద పడుకోబెట్టుకొని ఆర్నెల్ల చంటి వెధవకు ఆవుదం పోసే లెవెల్లో వుందామె

రైలు కదిలింది నా మనసులో ఏవేవో భావాలు కదిలాయి

రాజుగారి మీసాలు నన్ను వెక్కిరిస్తున్నట్టు కదిలాయి

యిరుకు సీట్లో ఆమె చేతివేళ్లు, నా నడుంమీద కదిలాయి అవి కాల్చిన అట్ల కాడల్లా వున్నాయి

నాకు నిద్రొచ్చి నట్టయి-మూర్ఛపోదామని ప్రయత్నించి ఓ అయిదు నిమిషాల కాలం చచ్చిపోయాను

"బాబూ! లే" ఆమె చనువుగా భుజం తట్టి లేపింది

ఉలిక్కిపడి కళ్లు తెరిచాను

ఏదో స్టేషను కనుచీకటి నా కంట్లో చీకటి

"అబ్బే చాలా మైనర్ ఆక్సిడెంట్" టింక్చర్ అయొడిన్ వాసన గుప్పుమంది. డాక్టర్ కాలికి కట్టుకట్టాడు

బాగ్‌లోంచి పాతిక రూపాయలు డాక్టర్ కిచ్చి "థాంక్స్! మీకు శ్రమ యిచ్చాను" అంది ఆమె

"అది నా డ్యూటీ, మీరు ముందుగా ఎస్సెమ్‌చేత ఫోన్ చేయించారు కనక, నేను రెడీగా వున్నాను ఈ మాత్రం సిన్సియారిటీ ఈ రోజుల్లో ఎవరికుందండీ"



డాక్టర్‌గారు వెళ్ళిపోయారు

"ఇంకా నిద్రేనా" అన్నది ఆమె

ఇంకో కప్ హార్లిక్స్

కప్పులు కడుక్కు రావడానికి వెళ్ళింది ఆమె

మీసాల రాజుగారు "అదృష్టవంతుడివి, లక్కీఛాన్స్" అన్నారు

" అంటే నా కర్థం కావడంలేదు" అన్నాను

"ఆ అర్థం ఆవిడే చెబుతుందిలే" అని-టాయ్‌లెట్ నుంచి వస్తున్న ఆవిడ్ని చూసి-పలమారని గొంతు సవరించుకుంటూ ఇందాకటి పొజిషన్లో సెటిలయిపోయాడు టెలిగ్రాఫ్ స్థంభాలు లెక్కెడుతూ

ఆమె సామాన్లన్నీ సర్దింది

రైలు రాజమండ్రిలో ఆగింది ఆమె కూలీని పిల్చింది

నలుగురైదుగురు పెద్ద మనుషులు ఆమె దగ్గర కొచ్చి కూలీకంటే నమ్రతగా సామాన్లు దించేశారు

ఆమె కిందికి దిగుతూ "వస్తా బాబూ" అంది

నేనేం మాట్లాడలేదు ఏమనాలో తోచక-తెలియక-ఆలోచించలేక

"మీ అడ్రస్" అనడిగింది



'ఎడ్రసిస్తే ఎప్పుడొచ్చి పడుతుందోనని' తప్పు పేరు, అడ్రసూ చెప్పాను

"బాబూ! నన్నపార్థం చేసుకోకు ఒక్కగా నొక్క కొడుకు, హార్వర్డ్‌లో చదువుతున్నవాడు, అచ్చం నీలాగే వుంటాడు బుగ్గమీద అచ్చం అక్కడే, అదే పుట్టుమచ్చ కార్ ఏక్సిడెంట్‌లో పోయాడు నా కొడుకు"

ఆమె కళ్ళలో నీళ్ళు

"ఆయన కొడుకుని చూడకుండానే వెళ్ళిపోయారు వాడు నా నుంచి దూరంగా - శాశ్వతంగా వెళ్ళిపోయాడు ఈ అమ్మని మర్చిపోకు బాబూ."

రైలు రౌద్రంగా కూసింది

ఆమె కన్నీరు చీర చెంగుతో వొత్తుకుంటోంది

రైలు ఓ హూపుతో కదిలింది

నా మెదడులో ఫ్యూజియామా బద్దలైంది

ఓ గంతులో కంపార్ట్‌మెంట్ గుమ్మం దగ్గరకు వచ్చా

ఆ అమ్మనుంచి, నన్నూ, నా నీచత్వాన్ని దూరంగా తీసికెళ్ళిపోతోంది రైలు.

ఆమె దూరంగా - దేవతలా వెళ్ళిపోతోంది ★